14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14 నుంచి 20 వరకు జరుగునని గ్రంథపాలకుడు అహ్మద్ షరీఫ్ శుక్రవారం తెలిపారు. 14వ తేదీ ఛాఛా నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభ వేడుకలను నిర్వహించుట, బాల బాలికలకు దేశభక్తి గీతాల పోటీలు, 15వ తేదీ గ్రంథాలయంలోని పుస్తకములతో పుస్తక ప్రదర్శన కార్యక్రమం, 16వ తేదీ గ్రంథాలయ ఉద్యమమునకు పాటుపడిన ఉద్యమకారులకు నివాళులు అర్పించుట, సభలు ఏర్పాటు చేయుట, 17వ కవి సమ్మేళనం రచయితల సెమినార్లు సందేశాలు, 18వ తేదీ విద్య పుస్తక పఠనం ప్రాముఖ్యత విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం, చిత్రలేఖనం, క్రీడల పోటీలు, 19వ తేదీన మహిళా దినోత్సవ వేడుకలు దిశా చట్టం, మహిళ సాధికారతపై చర్చ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

విశాలాంధ్ర

ప్రకాశం, బాపట్ల జిల్లాలు

నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు

డీఎస్పీ ఉప్పుటూరి నాగరాజు

విశాలాంధ్ర - శింగరాయకొండ : శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, నేరనియంత్రణకు పటిష్టమైన పోలీసువ్యవస్థను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా తాము పనిచేస్తామని డిఎస్పీ ఉప్పుటూరి నాగరాజు పేర్కొన్నారు. నేర సమీక్ష కోసం శింగరాయకొండ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఆయన ఇటీవల జరిగిన కేసుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాంతి భద్రతల విషయంలో ప్రతి ఒక్క పోలీస్ అధికారి అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. రికార్డులను పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు, సలహాలు అందించారు. చట్టప్రకారం నడుచుకోని వారిపై రౌడీ షీట్లు తెరవడంలో ఏమాత్రం వెనుకంజ వేయమని అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డిఎస్పి తెలిపారు.

మోదీ గోబ్యాక్

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణతో పాటుగా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటన సందర్భంగా మోడీ గోబ్యాక్ అంటూ విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి, సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లాలో నిరసనలు మిన్నంటాయి. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో వామపక్షాలు ఎర్రజెండాలు చేతబూని మోడీ గోబ్యాక్ అంటూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను రద్దు చేసిన తర్వాతే రాష్ట్రంలోకి అడుగుపెట్టాలని, విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని, విశాఖ రైల్వే జోన్ ప్రకటించాలని, కడప స్టీల్ ప్లాంట్‌ను నిర్మించాలని, రామాయపట్నంలో మేజర్ పోర్టును కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించాలని,రాజధాని అమరావతికి నిధులు కేటాయించాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం పూర్తి చేయాలని నినదించారు.

- విశాలాంధ్ర, ఒంగోలు :

- జిల్లా వ్యాపితంగా మిన్నంటిన నిరసనలు
- మోదీ పర్యటనకు వ్యతిరేకంగా రోడ్లపైకి వచ్చిన విశాఖ ఉక్కుపరిరక్షణ సమితి, వామపక్ష శ్రేణులు

ఒంగోలులో...

రాష్ట్రంలో మోడీ పర్యటనకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక సాగర్ లాడ్జ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పరిరక్షణ సమితి కన్వీనర్లు పివిఆర్ చౌదరి, చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణకు శ్రీకారం చుట్టిన ప్రధాని మోడీకి రాష్ట్రంలో పర్యటించే నైతిక హక్కులేదన్నారు. వేలాది మంది కార్మిక కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్న మోడీ ప్రభుత్వం కేవలం కార్పోరేట్ శక్తుల కోసమే పనిచేస్తుందని ధ్వజమెత్తారు. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక ప్రభుత్వం అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను, చట్టాలను రద్దు చేసి కేవలం నాలుగు కోడ్‌లు మార్చి కార్మికులను కట్టుబానిసలుగా మార్చేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ఈ పాటికే 8 గంటల పనిగంటల ప్రక్రియ నిర్వీర్య దశలో ఉందన్నారు. రాష్ట్రానికి ఎటువంటి నిధులు ఇవ్వకపోగా, విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్న మోడీ ప్రభుత్వానికి జగన్ ప్రభుత్వం సాష్టాంగపడి మరీ స్వాగతాలు పలకటం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. ముఖ్యమంత్రికి రాష్ట్రం పట్ల చిత్తసుద్ధి ఉంటే ప్రధానిని రాష్ట్ర ప్రయోజనాల పట్ల హామీలను నిలదీసి సాధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్‌డి సర్దార్, సీపీఎం నాయకులు రమేష్ తదిరతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కనిగిరి : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి ఎనిమిది ఏళ్లు అయినప్పటికీ ఆంధ్ర రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకుండా నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయటానికి అనర్హుడని సిపిఐ మండల కార్యదర్శి జిపి రామారావు అన్నారు. శుక్రవారం సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గోబ్యాక్ నరేంద్ర మోడీ నిరసన కార్యక్రమం దర్శి చెంచయ్య భవన్ నుంచి పామూరు బస్టాండ్ వరకు జరిగింది. మండల కార్యదర్శి జిపి రామారావు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌కి ప్రత్యేక హెూదా, విభజన హామీలు, ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయకుండా ,కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వకుండా విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతోటి 32 మంది త్యాగాలతో పోరాటంతో సాధించుకున్నటువంటి విశాఖ ఉక్కు ప్రైవేటుకనున్న వ్యతిరేకిస్తూ కార్మికులు చేస్తున్న పోరాటానికి వైసీపీ ప్రభుత్వం అనేక అడ్డంకులు ఇబ్బందులను పెడుతూ కేసులను నమోదు చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి మోకరిల్లుతున్న జగన్ ప్రభుత్వం నరేంద్రకు ఘనమైన స్వాగతం పలకటం ఏమిటని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేయకుండా ఈ రాష్ట్రం విభజన సమయంలో ఇచ్చిన ఏ వాగ్దానాన్ని కూడా అమలు చేయకుండా రాష్ట్రాన్ని నట్టేట ముంచినటువంటి నరేంద్ర మోడీ దగాకోరు విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలు కార్మిక సంఘాలు 11, 12 తేదీలలో నిరసన కార్యక్రమాల్లో చేపట్టడం జరుగుతుందన్నారు. ఏఐటియుసి కనిగిరి నియోజకవర్గ అధ్యక్షులు గుజ్జులా బాలిరెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగిస్తూ నిరుద్యోగులను పెంచిపోషిస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ నాయకులు పుట్ట సుబ్బారావు, మీరావలి, అంమృల్లా, జి రమణయ్య, రాజ్యం, యోహాను, కిష్టయ్య సుజాత తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : విభజన హామీలను అమలు చేయటంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా రాష్ట్రానికి చేసిన అన్యాయానికి, ద్రోహనికి, విశాఖ ఉక్కును పైవేటీకరణకు నిరసనగా సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా వామ పక్షపార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో యర్రగొండ పాలెంలోని పూలసుబ్బయ్య విగ్రహం ముందు నిరసన తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ 32 మంది బలిధానంతో నిర్మాణంలో ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంటును అమ్మకానికి పెట్టిన నరేంద్ర మోడీ ఈ రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు టీసీఎచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ గౌడ్, సీపీఐ యర్రగొండపాలెం మండల కార్యదర్శి గురవయ్య, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, దోర్నాల మండల కార్యదర్శి విశ్వరూపాచారి, దళిత హక్కుల పోరాట సమతి జిల్లా అధ్యక్షులు పూర్ణకంటి తిరుమలయ్య, ఏఐటీయుసీ నాయకులు ఎస్కే రహమాన్, సీపీఐ నాయకులు నక్కా తిరుపతయ్య పాల్గొన్నారు.

ఒంగోలులో నిరసన తెలుపుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి నాయకులు

కనిగిరిలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

యర్రగొండపాలెంలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న నాయకులు

చీరాలలో సీపీఐ నాయకులు

అధికార ప్రతిపక్షాలు ధ్వంద వైఖరి వీడండి

విశాలాంధ్ర-చీరాల : రాష్ట్ర అధికార పార్టీ వైస్సార్‌సీపీ, ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, జనసేనలు తమ ధ్వంద వైఖరి విడనాడాలని పార్లమెంట్‌లో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు అనుకూలంగా మద్దతు పలికి రాష్ట్రంలో నిరసన తెలుపుతున్న కార్మికులకు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉన్నామని చెపుతున్నారని ఈ ద్వంద వైఖరి తెలుసుకోలేని అమాయకులు ఆంధ్ర ప్రజలు కాదని సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. శుక్రవారం ప్రధాని నరేంద్రమోడీ విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ చీరాల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్దనుంచి గడియార స్తంభం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సి హెచ్ ప్రకాష్ పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు విశాఖ పర్యటన చేస్తున్న మోడీ ఇక్కడ కార్మికుల స్థితిగతులు అర్థం చేసుకోవాలని అన్నారు. విశాఖపట్నంలో తమ నిరసన తెలిపేందుకు ప్రజా సంఘాలకు పోలీసు అధికారులు బైక్ ర్యాలీ అనుమతులు ఇచ్చి ర్యాలీకి వచ్చినవారిపై తప్పుడు కేసులు బనాయించడం దుర్మార్గమైన చర్యని అన్నారు. నేటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోని విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని లేదంటే ప్రజాగ్రహానికి గురౌతారని అన్నారు. ఈ కార్య క్రమంలో బాసి పైడయ్యా,రామేశ్వరం కుమార్, సైకం రాజశేఖర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి

విశాలాంధ్ర-ఒంగోలు : మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా దేశం మొత్తం జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని జిల్లా కలెక్టరు ఏ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. శక్రవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ 134వ జయంతి సందర్భంగా పాత మార్కెట్ సెంటర్లోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారత ప్రభుత్వ తొలి విద్యా శాఖ మంత్రిగా పనిచేశారని కలెక్టరు గుర్తు చేశారు. స్వాతంత్ర్య భారతదేశానికి విద్యా ప్రమాణాలను పెంపొందించడానికి ఎంతో కృషి చేశారని ఆయన చెప్పారు. ఆజాద్ హయాంలో ప్రాథమిక, మాధ్యమిక విద్య, శాస్త్రీయ విద్య, విశ్వవిద్యాలయాల స్థాపన, పరిశోధన, ఉన్నత చదువుల మార్గాలను ప్రోత్సహించడానికి అనేక చర్యలు చేపట్టారని ఆయన వివరించారు. ఆజాద్ రచయిత, కవి మరియు పాత్రికేయుడు కూడా అని కలెక్టరు అన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత ప్రభావవంతమైన స్వాతంత్ర్య ఉద్యమకారులలో ఆజాద్ ఒకరని కలెక్టరు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ శ్రీమతి బూచేపల్లి వెంకాయమ్మ, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరు షేక్ మహబూబ్, మైనారిటీ సంక్షేమ జిల్లా అధికారి ఝాన్సీ, మైనార్టీ కార్పొరేషన్ ఈ.డి. ధనలక్ష్మి, ఒంగోలు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ముస్లీం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన హాలులో అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పరిషత్ విద్యాశాఖ అధికారి శ్యామ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డి.ఆర్.ఓ. బి.చిన ఓబులేసు మాట్లాడుతూ ఆజాద్ సేవలు, భారత దేశ విద్యాభివృద్ధిలో ఆయన పాత్రను విద్యార్థులకు వివరించారు. ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సూచించారు. డైట్ కాలేజీ నుంచి వచ్చిన విద్యార్థులు తెలుగు, ఆంగ్ల, హిందీ భాషలలో ఆజాద్ యొక్క గొప్పతనం గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ జిల్లా అధికారి ఝాన్సీలక్ష్మీ, ఎస్.సి. సంక్షేమ సాధికారత శాఖ అధికారి ఎం. లక్ష్మా నాయక్, ఏ.డి. అర్చన పాల్గొన్నారు.

జగనన్న కాలనీని పరిశీలించిన 'వరికూటి'

విశాలాంధ్ర - శింగరాయకొండ : ప్రజాసమస్యలపై ప్రతి శుక్రవారం కార్యక్రమంలో భాగంగా శింగరాయకొండ మండలం ఊళ్ళపాలెం రోడ్డులో నిర్మితమవుతున్న జగనన్న కాలనీ ఇళ్ళను వరికూటి పరిశీలించారు. నిర్మాణాలు జరుగుతున్న తీరు పై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈప్రాంతంలో మొత్తం 1420 ప్లాట్లుండగా 825 ప్లాట్లు మంజూరు చేయగా, 372 ప్లాట్లలో నిర్మాణాలు జరుగుతున్నాయి. జగనన్న కాలనీలో వసతుల ఏర్పాటు విషయంలో అధికారులు శ్రద్ధ చూపాలని, ఉన్నతాధికారులనుండి మంజూరు పొందడంలో తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శింగరాయకొండ మండలంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ జిల్లాకే మోడల్‌గా నిలవాలని ఆయన అధికారులను కోరారు. అనంతరం ఊళ్ళపాలెంలోని ఎస్టీకాలనీ సందర్శించిన ఆయన 2019లో ఆగిపోయిన నిర్మాణాలను కొనసాగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి అనుమతి మంజూరు చేయించారు. ఈవిషయంపై లబ్ధిదారులు హర్షం ప్రకటించారు. ఈ పరిశీలనలో వైస్ఎంపిపి రవికుమార్‌రెడ్డి, సలీంభాషా, మాజీ సర్పంచ్ పేర్రాజు, పటేల్, రమేష్ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి వేడుకలను ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో ఓక్రిడ్జ్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు షేక్ మహబూబ్ జాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి స్కూల్ కరస్పాండెంట్ శివప్రసాద్ పూలమాలను వేసి నివాళులర్పించారు. సారే జహాసే అచ్చా దేశభక్తి ప్రార్ధన గీతాన్ని బ్రహ్మయ్య మాస్టర్ ఆలపించారు. సంఘం అధ్యక్షులు షేక్ మహబూబ్ జాన్ రచించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా ఆయన చేసిన త్యాగాలను కొనియాడారు. విద్యకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తించి వారి జయంతిని విద్యా దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు దక్కిన గౌరవం అని అన్నారు. భారతదేశ అత్యున్నత గౌరవ పురస్కారమైన భారతరత్న అవార్డ్ తో ఆయన్ని భారత ప్రభుత్వం గౌరవించిందనీ అన్నారు. పుస్తక రచయిత షేక్ మహబూబ్ జాన్ మాట్లాడుతూ నేటితరం విద్యార్థులకు అబుల్ కలామ్ ఆజాద్ గురించి తెలియచేయనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని ముద్రించడం జరిగిందని అన్నారు. గ్రంథాలయాలకు, పాఠశాలకు ఈ పుస్తకాన్ని అందచేస్తానని అన్నారు. సంఘం కార్యదర్శి షేక్ హుమయూన్ భాష, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా ఊరేగింపు

విశాలాంధ్ర-సంతమాగులూరు : మండలంలోని కొమ్మాలపాడు కుందూరు ఏల్చూరు కొప్పరం గ్రామాలలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ఈ మాసం మొత్తం అత్యంత భక్తిశ్రద్ధలతో గ్యార్మి పండుగ ఉత్సవాలను ముస్లిం సోదరులు ప్రత్యేక నిర్వహించడం ఆనవాయితీగా వస్తూ ఉంది. కొమ్మాలపాడులో పడమర బజారు ముస్లిం ప్రజానీకం గార్మి పండుగను అత్యంత వైభవంగా విద్యుత్ కాంతులతో అలంకరించిన జండాలను జెండాకు శేషరాలను కట్టి గ్రామం మొత్తం మేళ తాళాలతో ఊరేగింపుగా ఊరేగించారు.

ప్రభుత్వాధికారులు నిర్లక్ష్యంగా ఉండొద్దు

కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-కురిచేడు : ప్రభుత్వ ఉద్యోగులు విధుల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన కురిచేడు మండలంలో పర్యటించి ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుతున్న తీరు, పలు పథకాలు అమలవుతున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కురిచేడు తహసిల్దార్ కార్యాలయంలోని కొన్ని ఫైళ్లు అనధికారికంగా బయటకు వెళ్లినట్లు ఇటీవల వచ్చిన ఆరోపణలపై విచారణ చేయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. మండల సర్వేయర్ కూడా విధులను నిర్వహించకుండా ప్రైవేటు లైసెన్స్ సర్వేయర్‌తో ఆ పనులను చేయిస్తున్నట్లు తనకు ఫిర్యాదు అందిందని కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణలోకి తీసుకుంటున్నామని, దీనిపై ఆర్డిఓ స్థాయిలో విచారణ జరిపించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి అయ్యాయని ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. తొలుత కురిచేడు-1, దేకన కొండ సచివాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. సచివాల ద్వారా ప్రజలకు సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. నిర్దిష్ట గడువులోగా సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఇళ్ల పట్టాల పంపిణీ విధానం, బాల్య వివాహాల కట్టడికి క్షేత్రస్థాయిలో మహిళా పోలీసులు చేపడుతున్న చర్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో డ్రాప్ అవుట్స్ లేకుండా పర్యవేక్షిస్తూ ఉండాలని, బడి వయస్సు పిల్లలు బడికి వెళ్లకపోతే వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా దృష్టి పెట్టాలని చెప్పారు. దేకనకొండ జగనన్న కాలనీ లేఅవుట్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఇక్కడ మొత్తం 53 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు.

తెగుళ్లను సత్వరం నివారించుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రస్తుతం సాగులో ఉన్న వరి, సజ్జ, మొక్కజొన్న, కంది, పత్తి, మిరప పంటలు సాగులో ఉన్న పంటల్లో వ్యాపించిన తెగుళ్లను రైతులు సత్వరం నివారించుకోవాలని లేనట్లయితే పంటలు దెబ్బ తినే ప్రమాదం ఉందని మండల వ్యవసాయ అధికారిని ఎన్ మేరమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమా వేసపు హాలులో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సాగులో ఉన్న మొక్కజొన్న, వరి, సజ్జ, మిరప, కంది, మిరప, పైర్ల యొక్క స్థితిగతుల గురించి వివరించారు. వరిలో వచ్చు అగ్గి తెగులు సుడిదోమ గొట్టాల పురుగు నివారణ గురించి తెలియజేశారు. మిరపలో తెల్ల దోమ నివారణ మరియు తామర తెగుళు నివారణకు పసుపు బులుగు జిగురు రంగు అట్టలను పంట మధ్యలో ఏర్పాటు చేసి పురుగులను నివారించు కోవచ్చన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను రాయితీపై అందిస్తామని తెలిపారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి

మాజీ ఎమ్మెల్యే కదిరి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ప్రతికుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైసిపీ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచినట్లు కనిగిరి మాజీశాసనసభ్యులు, వైసిపీ నాయకులు కదిరిబాబురావు అన్నారు. శుక్రవారం శీలంవారిపల్లె క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కదిరి బాబురావు మాట్లాడుతూ రాష్ట్రంలో యస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, కాపు, అగ్రకులాల మహిళలకు అర్హత ఉన్న ప్రతిఒక్కరికి వైయస్ఆర్ చేయూత పథకం అమలుచేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. విద్యారంగానికి, వైద్యరంగానికి అధికప్రాధాన్యత ఇచ్చి నాడునేడు పథకం కింద పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో ఆదునీకరించి విద్యార్థులకు అన్నివసతులు కల్పించడం జరిగిందని అలాగే వైద్యరంగంలో ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం అందించి అవినీతిరహితంగా ప్రజలు నచ్చిమెచ్చే విధంగా ప్రజారంజక పాలన అందిస్తూ రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా జవాబుదారీతనంతో పనిచేస్తున్న వైసిపీ ప్రభుత్వానికి రాష్ట్రప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని తెలిపారు. ప్రతిపక్షపార్టీలు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని వైసిపీ ప్రభుత్వాన్ని విమర్శించడం పనిగా పెట్టుకున్నారని రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నాయ కత్వంలో తిరిగి అధికారం చేపట్టడం ఖాయమని కదిరిబాబురావు అన్నారు. ఈ కార్యక్రమంలో మన్నేపల్లి రవి కుమార్, మన్నేపల్లి సురేష్, కొట్టెవెంకటేశ్వర్లు, టి ఆంజనేయరెడ్డి, డాక్టర్ కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

మార్కాపురం అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

జి.డబ్ల్యు .ఒ.పి. 12/2022

బిట్వీన్ :

1) ఈదా లక్ష్మీ నిర్మల వగైరాలు - పిటీషనర్స్ పర్సెస్

గూడా అంజమ్మ - రెస్పాండెంట్

పై ఉదహరించిన పిటీషన్లో 2,3 పిటీషనర్స్ మైనర్స్ అయినందు వలన గార్డియన్‌గా 1వ పిటీషను వ్యవహించుచూ ఈ పిటీషన్ షెడ్యూలు ఆస్తిని అమ్ముటకు కోర్టు ద్వారా పర్మిషన్ కోరుచున్నారు. ఈ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నట్లయితే కోర్టుకు వచ్చి **తేది.18.11.2022న ఉదయం గం.10-30 ని.లకు** వకీలు ద్వారా గాని లేదా సొంతంగా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపవలసినది. లేనియెడల మీకు పరోక్షముగా తీర్పునిచ్చెదరని తెలియజేయడమైనది.

షెడ్యూలు

1వ అయిటం : ప్రకాశం జిల్లా, మార్కాపురం డిస్ట్రిక్ట్, పొదిలి సబ్ రిజిస్ట్రేషన్ కేశవటొట్లపాలెం గ్రామ సర్వేనెంబర్లు :

1) సర్వేనెం. 10/1బి . య.0-84 సెంట్లు
2) సర్వేనెం. 10/2బి - య.0-70 సెంట్లు
3) సర్వేనెం. 10/3బి - య.0-69 సెంట్లు
4) సర్వేనెం. 10/4బి - య.0-69 సెంట్లు
5) సర్వేనెం. 10/5బి - య.0-72 సెంట్లు
6) సర్వేనెం. 10/6బి - య.0-82 సెంట్లు

మొత్తం య.4-45 సెంట్లు

హద్దులు: తూర్పు : గట్టుపల్లి చినకోటయ్య **దక్షిణం :** చిట్టిల హర్షవర్ధన్ రెడ్డి **పడమర :** డొంక **ఉత్తరం :** ఈదా ప్రదీప్తా రెడ్డి

2వ అయిటం : - డిటో - గ్రామ

1) సర్వేనెం. 3/5ఎ2 - య.1-02 సెంట్లు
2) సర్వేనెం. 3/2బి య.0-54 సెంట్లు
3) సర్వేనెం. 4/4బి - య.0-84 సెంట్లు
4) సర్వేనెం.5/2ఎ - య.0-51 సెంట్లు

మొత్తం . య.2-91 సెంట్లు

హద్దులు: తూర్పు : గట్టుపల్లి కోటయ్య **దక్షిణం:** పులిబడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి **పడమర :** బండి ఏసురత్నం **ఉత్తరం:** ఈదా ప్రదీప్తా రెడ్డి

3వ అయిటం : - డిటో - గ్రామ సర్వేనెం. 2 రులో య.4-30 సెంట్లు భూమికి **హద్దులు : తూర్పు :** గట్టుపల్లి చినకోటయ్య **దక్షిణం :** ఈదా కోటయ్య **పడమర:** డొంక **ఉత్తరం :** బాట

4వ అయిటం : - డిటో - గ్రామ సర్వేనెం. 3/3బి రులో య.0-89 సెంట్లు భూమికి **హద్దులు : తూర్పు :** గట్టుపల్లి కోటయ్య **దక్షిణం:** పులిబడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి **పడమర :** బండి ఏసురత్నం **ఉత్తరం :** ఈదా కౌషిక్ రెడ్డి

గూడా అంజిరెడ్డి, అడ్వకేట్, అద్దంకి.

ఒంగోలు నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి డిమాండ్

ఒంగోలు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్న సీపీఐ శ్రేణులు

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి పిలుపునిచ్చారు. ఒంగోలు నగరంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఐ ఒంగోలు నగర సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా పివీఆర్ చౌదరి మాట్లాడుతూ ఒంగోలు నగరం మున్సిపాలిటీ నుండి కార్పొరేషన్‌గా రూపాంతరం చెంది పది సంవత్సరాలు దాటుతున్న మౌలిక సదుపాయాలు కల్పనలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న తీరుగా ఉందన్నారు. విలీన గ్రామాలకు నేటికీ సరైన రోడ్డు మార్గాలు లేవన్నారు. సరళ దేవి నగర్, దత్తాత్రేయ కాలనీ, కార్మిక నగర్, మదర్ తెరిసా కాలనీ, చైతన్య నగర్, నేతాజీ కాలనీ లలో విద్యుత్తు రోడ్లు మురుగునీరు పారుదల ఏర్పాటు చేయాలన్నారు. పెరిగిన నగర ప్రజలకు సరిపడా తగినంతమంది పారిశుధ్య కార్మికులను నియమించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నగరంలో డ్రైనేజీ సిస్టం గాని,రోడ్డు మధ్య డివైడర్లు ఏర్పాటు గాని, విద్యుదీకరణ గాని, తాగునీటి సౌకర్యం గాని సక్రమంగా లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. శివారు కాలనీలతో పాటుగా ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్, కర్నూల్ రోడ్, 60 అడుగుల రోడ్డులు చిన్నపాటి వర్షాలకే తటా కాలను తలపిస్తున్నాయన్నారు. వెంగంపాలెం గ్రామంలో దళితులకు స్మశానం లేకపోవడంతో రోడ్డు పక్కనే శవాలను పూడు స్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 డివిజన్లో తో కూడిన ఒంగోలుకు మండల కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నగరం మురుగునీరు పారుదలకు ప్రధాన వనరైన పోతురాజు కాలువ ఆధునీకరణ పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. అంజయ్య రోడ్డు నుండి సుజాతనగర్ కు అండర్ పాస్ నిర్మించాలని డిమాండ్ చేశారు. పర్లమిట్ట చెరువు ,కొప్పులు చెరువు, పెళ్లూరు చెరువులను తాగునీటి చెరువులగా మార్చి వాటిని తాగునీటితో నింపి ఒంగోలు నగర ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోసిపిఐ నాయకులు ఉప్పుటూరి ప్రకాష్ రావు, కొత్తకోట వెంకటేశ్వర్లు,,కైలా అజయ్,ఎస్ మధుబాబు,జి సుధాకర్, కందుకూరి సుభాన్ నాయుడు, సిహెచ్ వెంకటేశ్వరరావు, అసాదు, బి వెంకట్రావు, పి సిద్దయ్య, పి నరసింహారావు, ఎస్ రవిచంద్ర,ఎం ప్రమీల, పి నాంచారమ్మ, లీలమ్మ, జి రాణి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

కేంద్రాలను పరిశీలిస్తున్న సర్పంచ్ దంపతులు కటికల వెంకటరత్నం రిబ్కా

విశాలాంధ్ర-వెలిగండ్ల : చెత్త నుండి సంపదను సృష్టించేందుకు ఏర్పాటుచేసిన కేంద్రాలను సద్వినియోగపరచుకోవాలని సర్పంచ్ దంపతులు కటికల వెంకటరత్నం రిబ్క అన్నారు. శుక్రవారం మండలంలోని గుడిపాటి పల్లిలో వ్యాధులు పరిచేరకుండా ఉండేందుకు గ్రామంలో ఉన్న చెత్తను సంపద కేంద్రాలకు తరలించేందుకు పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేయడం జరిగిందని వారి ద్వారా గ్రామంలో ఉన్న చెత్తను కేంద్రాలకు తరలించి సీజనల్ వ్యాధుల నుండి పంచాయతీ ప్రజలు బయటపడాలని సూచించారు. తడి పొడి చెత్తను వేరుచేసి చెత్త కేంద్రాలకు తీసుకురావడంలో గ్రీన్ అంబాసిడర్‌లు కీలకంగా వ్యవహరించి ఎప్పుడు చెత్త అప్పుడు తీసుకువెళ్లాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జల్‌జీవన్ పథకంలో భాగంగా గ్రామంలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్న తరుణంలో పైపులైన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాప బత్తిని నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పద్మ సచివాలయ సిబ్బంది గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

సెలవు దినాల్లో తరగతులు వద్దు

ఏఐఎస్ఎఫ్ ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి చామల లక్ష్మారెడ్డి డిమాండ్

ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న లక్ష్మారెడ్డి తదితరులు

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు పట్టణం లోని ప్రైవేట్, కార్పొరేటె పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతి గదులు నిర్వహిస్తున్న ప్రయివేటు, కార్పోరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎంఇఓ కార్యాలయంలో ఎంఇఓకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్వేచ్ఛతో కుడినటువంటి విద్య తీసుకురావాలని ప్రయత్నాలు చేస్తుంటే ఈ ప్రైవేటే, కార్పొరేటె విద్య సంస్థలు పాఠశాలలు విద్య హక్కు చట్టన్ని ఉల్లఘించి సెలవు రోజులలో తరగతి గదులు నిర్వహిస్తు విద్యార్థుల మీద మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు.. సెలవు రోజులలో తరగతులను నిర్వహిస్తున్న ప్రైవేటే, కార్పొరేటె విద్య సంస్థల మీద మండల విద్యశాఖాధికారి, ఏ.ఓకి చామల లక్ష్మారెడ్డి,జిల్లా నాయకులు వాసు,భవాని నాయుడు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ముత్తిరెడ్డి వెంకటరెడ్డి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రజలు కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగ పరుచుకోవాలని వెలిగండ్ల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకట్రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని టిడిపి కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో తెలుగుదేశం నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శంకర్ కంటి వైద్య శిబిరము నిర్వహించడం జరుగుతున్నందున మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ పార్టీ అధ్యక్షులు మీమీ గ్రామాలలో ఉన్న కంటి చూపు మందగించిన వారికి తెలియపరచి ఆదివారం నిర్వహించే కంటి వైద్య శిబిరానికి దగ్గరుండి కార్యకర్తలు ప్రజలకు సేవ అందించాలని కంటి వైద్య పరీక్షలు చేయించు కునేవారు ఉదయం 10 గంటలకు అమరావతి గ్రౌండ్స్‌కి చేరుకోవాలని వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గుంటూరులోని శంకర్ నేత్రాలయానికి తరలించి శస్త్ర చికిత్స చేయించి ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం జరుగు తుందని ముందుగా పేరు నమోదు చేసుకునేందుకు 9866534043, 9000781790. నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

పలువురిని పరామర్శించిన గొట్టిపాటి

విశాలాంధ్ర-బల్లికురవ : మండల పరిధిలోని అంబడిపూడి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకుడు గాలి వెంకటేశ్వర్లును అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పరామర్శించి ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే గ్రామానికి జాష్టి అశోక్‌బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారింటికి వెళ్లి అశోక్‌బాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధైర్య పడవద్దని అన్ని విధాల అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసి పోతమ్మ శుక్రవారం మృతి చెందగా పోతమ్మ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన సిద్దయ్య ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకోగా సిద్ధిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈయన వెంట ఆ గ్రామ మాజీ సర్పంచ్ మండలపు సుధాకర్, మండల తెలుగు యువత దూళిపాళ్ల హనుమంతరావు, బెల్లంకొండ సుబ్బారావు, దద్దాల అంజయ్య, కిలారి నరసింహారావు, శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ జాష్టి బ్రహ్మాలు తదితరులు ఉన్నారు.

పేదోళ్ల జీవితాల్లో వెలుగులు

విశాలాంధ్ర-నాగులప్పలపాడు : రాష్ట్రంలో ప్రతి పేదవాడి జీవితంలో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి గుండె చప్పుడులో ఉంటారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాగులుప్పలపాడు గ్రామంలో శుక్రవారం టీజేఆర్ సుధాకర్ బాబు పర్యటించారు. ముందుగా గ్రామంలోనే ప్రధాన కూడలిలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి గత మూడు సంవత్సరాలలో ప్రభుత్వం చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామంలోనే ప్రధాన సమస్యలైనా సిమెంట్ రోడ్లు సైడ్ కాలవలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విన్నవించారు. ఆయన వెంటనే సంబంధిత అధికారులకు సమస్యలను వివరించారు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వాటికి కావలసిన నిధులను కేటాయిస్తానని ఆయన అన్నారు. అవ్వ తాతలను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడుగు తెలుసుకొని ప్రతినెల పింఛన్ వస్తుందా లేదా అని తెలుసుకున్నారు గడపగడపకు విశేష ఆదరణ లభించడం ఆనందంగా ఉందన్నారు సంక్షేమ ఫలాలు ప్రతి గడపకు చేరటం ద్వారా పేదవాడి జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మరల ముఖ్యమంత్రిని చేసే విధంగా కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ళ బంగారు బాబు, పార్టీ సీనియర్ నాయకులు మారెళ్ళ శేషయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎనగంటి పిచ్చిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పోలవరపు శ్రీమన్నారాయణ, వివిధ శాఖల డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మోక్షం

విశాలాంధ్ర - శింగరాయకొండ : 'విశాలాంధ్ర' ప్రచురించిన కథనానికి ప్రభుత్వం స్పందించింది. బింగినపల్లి వాసుల కష్టాలకు మోక్షం లభించింది. కొండెపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు స్పందించిన తీరుతో ఊళ్ళపాలెం నుండి బింగినపల్లికి నూతన రోడ్డు నిర్మాణం మంజూరైంది. 48లక్షల ఖర్చుతో 1.3 కిమీ పొడవుగల ఈమార్గానికి తారు రోడ్డు మంజూరైనట్లు వరికూటి ప్రకటించారు. పనులు శుక్రవారం నుండి ఆరంభమయ్యాయి. ప్రజల సమస్యను వెలికితీసినందుకు విశాలాంధ్ర పత్రికకు వరికూటి అభినందనలు తెలిపారు. విశాలాంధ్ర దినపత్రికలో ఈనెల 6వతేదీన నరకయాతన పేరిట ఊళ్ళపాలెం-బింగినపల్లి రోడ్డు అవస్థలపై కథనం ప్రచురితమయింది. ఈకథనానికి స్పందించిన వరికూటి అశోక్‌బాబు అధికారులతో మాట్లాడి రోడ్డు మంజూరు చేయించారు. ఈరోడ్డు మంజూరు విషయాన్ని శుక్రవారం బింగినపల్లి గ్రామానికి వెళ్లిన వరికూటి స్వయంగా ప్రకటించారు. ప్రారంభమయిన రోడ్డు పనులను పర్యవేక్షించి, త్వరలోనే రోడ్డు పూర్తి చేయించి బింగినపల్లి వాసుల ఆకాంక్షను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. చొరవతీసుకుని రోడ్డు మంజూరు చేయించినందుకు వైస్ఎంపిపి రవికుమార్‌రెడ్డి వరికూటికి కృతజ్ఞతలు తెలిపారు.

కుష్టు వ్యాధి నివారణ వారోత్సవాలు జయప్రదం చేయాలి

- మారళ్ళ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్

విశాలాంధ్ర-ముండ్లమూరు : జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న వారోత్సవాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైద్యాధికారి సిహెచ్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని మారెళ్ళ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. ఈనెల 15 నుండి వచ్చేనెల 5 వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటించి అంగ వైకల్య నివారణకు చేపట్టే కార్యక్రమాన్ని గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య బోధకురాలు ఎస్కే హుస్సేన్ బి.సిహెచ్‌ఓ వెంకటరావు, సూపర్వైజర్ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- మేనేజర్ శ్రీనివాసులు

కేక్ కట్ చేస్తున్న బ్యాంక్ మేనేజర్, ఖాతాదారులు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : యూనియన్ బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ బి.శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన కొనకనమిట్లలోని యూనియన్ బ్యాంకులో ఆ బ్యాంకు స్థాపించి 104 సంవత్సరాలు పూర్తి చేసుకుని 105 ఏడాదిలోకి అడుగుడుతున్న సందర్భంగా కేక్ కట్ చేసి ఖాతాదారులకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 8870 యూనియన్ శాఖలు పనిచేస్తున్నాయని ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రుణాలు వ్యవసాయతర రుణాలైనా బంగారంపై ఇతర రుణాల తోపాటు స్వయం సహాయ సంఘాలలోని మహిళలకు పదికోట్ల రూపాయలను అందజేశామన్నారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలకు తక్కువ వడ్డీతో చెల్లించాలని ఖాతాదారులు వారి సొమ్మును డిపాజిట్ చేసుకున్నట్లయితే వారికి ఏడు శాతం పైగా వడ్డీ చెల్లించడం జరుగుతుందన్నారు. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించి బ్యాంక్ అధికారులకు సహకరించాలని మేనేజర్ కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మురళీకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్ గనివానిపాడు, సర్పంచి పాలూరు లక్ష్మీ సాంబ వెంకటేశ్వర్లు, బ్యాంకు సిబ్బంది ఖాతాదారులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం

ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కొనకనమిట్ల : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్న మన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగరాజు కుంట గ్రామంలో మాజీ సింగిల్ విండోఅధ్యక్షుడు కామసాని వెంకటేశ్వర్‌రెడ్డి కామసాని శేషిరెడ్డిల ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలతో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైకాపా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 90 శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. గడపగడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణ, జడ్పిటిసి సభ్యుడు ఏడుకొండలు, వైకాపా మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకట్రాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భారతి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి సిహెచ్ కోటేశ్వరరావు, నాయకులు పాలూరి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో జనార్ధన్, తాసిల్దార్ ప్రసాదరావు, వ్యవసాయ అధికారిని ప్రసన్న రంగలక్ష్మి, ఏపిఎం గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి చిన్న సుబ్బయ్య సచివాలయ సిబ్బంది వాలంటీర్లు వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు కీలకం

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కరణం బలరాం

విశాలాంధ్ర-చీరాల : జ్ఞాన సముపార్జనకు గ్రంధాలయాలు కీలకమని ప్రతిఒక్కరు గ్రంథాలయాలను వినియోగించుకొని జ్ఞానసముపార్జన చేసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించిన బ్రోచర్లు గోడ పత్రికలను ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి తన నివాసంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో యువత చరవాణీలకు అలవాటు పడి పుస్తకాలకు దూరమౌతున్నరాని జ్ఞానాన్ని సాధించాలంటే పుస్తకాలు చదవాల్సిందేనని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. తల్లి దండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు అలవాటు చేయాలని,నవంబర్ పద్నాలుగు నుంచి జరగబోయే వారోత్సవాలకు విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని సూచించారు. అనంతరం భారత మొదటి విద్యాశాఖామంత్రి మౌలాన అబ్దుల్ కలామ్ ఆజాద్ జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంధపాలకురాలు ధనమ్మ, మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బోనిగల జైసన్ బాబు, కృష్ణమూర్తి, గాదె హరిహరరావు, మణిబాబు, రవికుమార్, బీరం సుందరరావు, సుబ్బరామయ్య, హరిప్రసాద్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బేస్తవారిపేట : ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. మండలంలోని చెట్టిచర్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థలను తీసుకొని వచ్చి ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ఇచ్చిన మాట ప్రకారం 98 శాతం హామీలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ దేనని కొనియాడారు. ముందుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే అన్నాను గజమాలతో సత్కరించి పూల వర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా ప్రతి వీధిలో ప్రతి గడప - గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి మూడేళ్ళ పాలనలో అందించిన సంక్షేమ పుస్తకాలను అందించడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జడ్పీటీసీ బండ్లమూడి వెంకటరాజు, సర్పంచ్ పోతుల కృష్ణారెడ్డి, ఎంపీడీఓ చెన్నకేశవరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

13న బీసీ ఐక్యవేదిక వనభోజనాలు

విశాలాంధ్ర-పామూరు : బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ సిఎస్‌పురం మండలం భైరవకోనలో నియోజక వర్గస్థాయిలో వనభోజనాలను నిర్వహిస్తున్నట్లు జడ్పిటిసి చప్పిడి సుబ్బయ్య, సీఎస్‌పురం ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక స్వయంకృషి సేవ సంస్థ కార్యాలయంలో వనభోజనాలకు సంబంధించిన కరపత్రములు ఆవిష్కరించి నారు. ఈ కార్యక్రమంలో బిసి మండల నాయకులు షేక్ చాంద్బాషా, చెనికల శ్రీనివాసులు, చల్లా సుబ్బారావు, షేక్ నాయబ్ రసూల్, రేగలగడ్డ నాగరాజు, బాల బ్రహ్మచారి, పోలేపల్లి బాల సిద్ధయ్య, దేవండ్ల గురుస్వామి, మిటికల నారాయణ, దనెంకుల నాగేంద్ర, ఎస్ శ్రీనివాసులు, ఓగురి ఏడుకొండలు, నాగి రసూల్, భూసరాజ్. హరీష్ పాల్గొన్నారు.

మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి

విశాలాంధ్ర-పామూరు : స్వాతంత్ర సమరయోధుడు భారతదేశపు తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం 134వ జయింతి వేడుకలును స్థానిక ఇరుపూరు రోడ్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గం గౌరవ అధ్యక్షులు షేక్ హాజీ గౌస్, ప్రధానోపాధ్యాయులు షేక్ రహమతునిస, కనిగిరి నియోజక వర్గ అధ్యక్షులు షేక్ హుస్సేన్, నియోజవర్గ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ రషీద్, పట్టణ అధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా (లిబర్టీ), మండల వర్కర్స్ అధ్యక్షులు షేక్ సుభాని, షేక్ హాజీ, షేక్ దాదా పీర్ పాల్గొన్నారు.

జాతీయ విద్యాదినోత్సవం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : జాతీయ విద్యాదినోత్సవంను పురస్కరించుకుని భారత దేశపు మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలను యర్రగొండపాలెం జెడ్పీహెచ్ ఎస్ స్కూల్, కేజీబివి స్కూల్ నందు ఘనంగా నిర్వహించారు. ఎంఇఓ ఆంజనేయులు మాట్లాడుతూ విద్య అనేది వ్యక్తి ప్రగతికే కాదు, మొత్తం జాతి నిర్మాణానికి పురోగతికే పునాది వంటిదని మౌలానా అబుల్ కలాం మాటలు గుర్తు చేశారు. కేజీబివి స్కూల్ ప్రిన్సిపాల్ తిరుమల దేవి మాట్లాడుతూ ప్రాథమిక విద్యను ఉచిత విద్యగా చేసి ప్రతి భావి భరత పౌరుడు విద్యను అభ్యసించేలా చేసిన మహోన్నత వ్యక్తి అని గుర్తు చేశారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండవ రోజు అయిన శుక్రవారం గిద్దలూరు నియోజకవర్గం బాలుర క్రీడాకారుల ఎంపిక పోటీలను గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే క్రీడాకారుల నుంచి ఎమ్మెల్యే గౌరవవందనం స్వీకరించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి అన్నా రాంబాబు నివాళులర్పించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేపించిన డైరీలను ఎమ్మెల్యే అన్నా విద్యార్థులకు అందజేశారు. జగనన్న స్పోర్ట్స్ క్లబ్ క్రీడా పోటీలకు అవసరమైన టీ షర్టులను ఎమ్మెల్యే అన్నా రాంబాబు వ్యాయామ ఉపాధ్యాయులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి ఆట పోటీల్లో గెలుపొందాలని అన్నారు. నాటి చదువులను, నేటి చదువులకు వ్యత్యాసం చెబుతూ విద్యార్థుల కొరకు ప్రభుత్వం తీసుకువచ్చిన పలు సంక్షేమ పథకాల గురించి విద్యార్థులకు వివరించారు. ఎంపీపీ కామూరి అమూల్య, జడ్పిటిసి వెంకట నాయుడు, తహసిల్దార్ రమాదేవి, ఎంపీడీవో నరసయ్య పాల్గొన్నారు.

వైసీపీ పాలనపై ప్రతి గడపలో అభిమానం

ఎమ్మెల్యే అన్నా రాంబాబు

విశాలాంధ్ర-గిద్దలూరు : ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రతి గడపలోని ప్రజలు అభిమానం చూపుతున్నారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. శుక్రవారం గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని కొంగలవీడు రోడ్డు సచివాలయం పరిధిలోని 6,7వ వార్డుల్లో నిర్వహించిన 58వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొన్నారు. ముందుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్కైపెక్స్ ఫ్రెండ్స్ సిటీ బృందం సభ్యులు ఎమ్మెల్యే అన్నాను భారీ గజమాలతో సత్కరించి, కోలాటం, చిన్నారుల నృత్య ప్రదర్శనలతో దారి పొడవునా పూల వర్షంతో ఎమ్మెల్యే అన్నాకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా వార్డులోని మోహన్ నగర్, బిలాల్ మసీద్ రోడ్డు, రెడ్డి బజారు, షాజనగర్, శ్రీరామ్ నగర్ ఏరియాలో ప్రతి గడప - గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్దిని వివరించి మూడేళ్ళ పాలనలో అందించిన సంక్షేమ బుక్ లను అందించడం జరిగింది. అనంతరం ఆయా వీధుల్లో స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ జగనన్న ప్రవేశ పెట్టిన అనేక రకాల సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ది పొందారన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే అన్నాను పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే అన్నాకు ప్రతి గడప లో మహిళలు హారతులతో స్వాగతం పలుకుతూ ఆహ్వానం పలికారు. అనంతరం రూ.6 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. వార్డులో ఒక సోదరి ఎమ్మెల్యే అన్నా కు ర్యాఖీ కట్టి స్వీట్లు తినిపించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వార్డులో కరాటే విద్యార్థిని ఏం భావన అనే 14 సంవత్సరాల అమ్మాయి హైదరాబాద్లో జరిగే అండర్ -14-19 పోటీలకు ఎంపిక కాగా శాలువా, పూలమాల్లతో అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ముఖ్య నేతలు, నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఇల్లు - పేదల కన్నీళ్లు' జయప్రదం చేయండి

ఈనెల 12,13,14వ తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ పిలుపు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్

విశాలాంధ్ర-ఒంగోలు : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఈనెల 12 13 14 వ తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జగన్ అన్న ఇల్లు పేదల కన్నీళ్లు ఆందోళన కార్యక్రమాన్ని ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాలలో జయప్రదం చేయాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 28 లక్షల 30 వేల ఇల్లు నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీ మూడున్నర సంవత్సరాల వైసిపి పాలనలో ఎక్కడ అమలు కాలేదు. ఒక ఇల్లు పూర్తిస్థాయిలో నిర్మించి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వం టిడ్కో ఇల్లు ఇస్తే , అనర్హులకు ఇచ్చారంటూ వాటిని ఇవ్వకుండా నిలిపివేశారన్నారు. అప్పుడు అర్హులుగా కనిపించిన పేదవారు ఇప్పుడు అనర్హులుగా ఎలా మారారో అధికారులు చెప్పాలని రియాజ్ ప్రశ్నించారు. 12వ తేదీన జిల్లావ్యాప్తంగా టిడ్కో గృహాలు నిర్మించిన ప్రాంతాలలో లబ్ధిదారులను కలుసుకొని వారితో చర్చిస్తామన్నారు. 13వ తేదీన జగనన్న కాలనీలను సందర్శించి లబ్దిదారుల సాధకబాధకాలు తెలుసుకుంటామన్నారు. 14వ తేదీన సచివాలయం సందర్శించి జగనన్న కాలనీలపై ఆడిట్ జరుపుతామన్నారు. బాధితుల నుండి సేకరించిన సమాచారాన్ని సామాజిక మాధ్యమాలలో విడుదల చేస్తామని తెలిపారు. ఒంగోలు నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులు రెడ్డి ఐరన్ ఉన్న కొండ ప్రాంతాన్ని జగనన్న కాలనీల కోసం ఎంపిక చేశారన్నారు. కొండను తవ్వి చదును చేసి ప్లాట్లుగా మార్చారన్నారు. అయితే ఐరన్ ఓర్ కోసం లీజ్ తీసుకున్న వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో అవి నిలిచిపోయాయి అన్నారు. భూమి అభివృద్ధి కోసం ఖర్చు చేసిన నిధులు ఎవరిస్తారు చెప్పాలని ప్రశ్నించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇస్తే, అవి తామే ఇస్తున్నట్టు జగన్ ఫోజులు కొడుతున్నారన్నారు. జనసేన పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు జగన్ పేదల సొంతింటి కలల సహకారం పై నీళ్లు చల్లారన్నారు. పేదల పిల్ల పేరుతో ప్రభుత్వ ఖజానాను దోచుకున్నారు. తన అనుచర గణానికి దోచిపెడుతున్నా రన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి వంశీ దీప్ మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరుతో 24 వేల ఎకరాల భూమిని కొనుగోలు చేసిన ప్రభుత్వం 60 వేల కోట్లు స్కాం కు పాల్పడిందన్నారు. ఈనెల 12 ,13, 14 తేదీలలో నిర్వహించే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి లు కళ్యాణ్ ముత్యాల, రావి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ ఉస్మాన్ ఆధ్వర్యంలో దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కాపురం పట్టణ వైసీపీ అధ్యక్షులు వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, మరో వస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాస్, వైసీపీ నాయకులు షేక్ షెక్షా, ఖలీల్, బిలాల్, కరిముల్లా, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ప్రయివేటు కార్యక్రమంలో ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు పట్టణంలోని విట్టా సుబ్బారత్నం కళ్యాణ మండపంలో పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహ ట్రావెల్స్ యజమాని దూదేకుల షరీఫ్ మనవరాలు యషీరా పుట్టినరోజు వేడుకలకు గిద్దలూరు టిడిపి ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు పలువురు టిడిపి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు పట్టణంలోని పలు వివాహ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. చీతిరాల ఫంక్షన్ హాల్ నందు సయ్యద్ ఇసామియా కుమారుడు సయ్యద్ ఇజాజ్ అహ్మద్ మరియు విట్టా సుబ్బారత్నం కళ్యాణ మండపం నందు షేక్ ఖాదర్ వలి కుమార్తె నూరు ఏ చెష్మి పఠాన్ మోహిసిన్ ఖాన్‌ల నిఖా కార్యక్రమానికి అనంతరం కంభం పట్టణంలోని మున్నాన్ ఫంక్షన్ హాల్ నందు సయ్యద్ కరిముల్లా కుమార్తె నూర్ ఏ చెష్మి సయ్యద్ రఫీల వివాహ కార్యక్రమానికి గిద్దలూరు టిడిపి ఇన్చార్జ్ మాజీ శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. వారితో పాటు పలువురు టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై ఆకస్మిక దాడులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరు మండలంలోని విద్యుత్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. విద్యుత్ విజిలెన్స్ ఈఈటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో దర్శి విద్యుత్ ఈఈ ఎస్‌ఏ కరీం, దర్శి విద్యుత్ డిఈఈ కే పిచ్చయ్య, చీమకుర్తి విద్యుత్తు డిఈఈ, ఏ గురునాథం, పొదిలి విద్యుత్తు డిఈఈ కే శ్రీనివాసరెడ్డి, ముండ్లమూరు విద్యుత్ ఏఈ జె భూరాజు ఆధ్వర్యంలో 27 బృందాలుగా విడిపోయి గ్రామాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 29 మందిపై కేసులు నమోదు చేశారు. వారిపై 1లక్ష 29వేల రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ టి శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా విద్యుత్ చౌర్యం చేస్తూ పట్టుబడితే జైలుకు వెళ్లడం తప్పదని హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారులు పాత బకాయిలు ఉంటే చెల్లించాలని లేకుంటే సర్వీసును తొలగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 11 మండల ఏఈలు, జేఈఈలు, ఎల్ఐలు, లైన్‌మాన్‌లు తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబ్దుల్ కలాంకు నివాళి



విశాలాంధ్ర-పెద్దదోర్నాల : గ్రంధాలయం దోర్నాల నందు డాక్టర్ మౌలానా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు గ్రంథాపాలకుడు వై వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్రపటానికి వార్డు నెంబర్ జబ్బర్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. మౌలానా అబ్దుల్ కలాం 1888 నవంబర్ 11న జన్మించారు. భారతదేశానికి మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో ప్రముఖ పాత్రలు వహించారు. పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు, శేసిరెడ్డి, ఇంజనీర్ సచివాలయ సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్, హెల్త్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పాఠశాల తరగతి పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలోని ఎస్సీ కాలనీలో గల ఏఏ ప్రాథమిక పాఠశాలలోని తరగతి గది ప్రక్కనే ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే కుళాయి దగ్గర మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్యార్థులతో పాటు రెండు అంగన్వాడి కేంద్రాల్లోని చిన్నారులతో కలిపి మొత్తం 180 మంది పాఠశాలలో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తరగతి గదికి పది అడుగుల దూరంలో ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకుని కుళాయి దగ్గర మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రహరీ గోడ లోపలనే ఉండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాశిరెడ్డి విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకున్న వారే లేరే విశాలాంధ్రతో వాపోయారు. ఇటీవల 10 రోజుల క్రితం సిద్ధవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ తగిలి బాలుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతు భరోసా కేంద్ర వలంటీర్లు రైతులకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర-తాళ్లూరు : రైతు భరోసా కేంద్రాల కొరకు నియమించిన వాలంటీర్లు రైతులకు అందుబాటులో ఉండాలని, బాధ్యతాయుతంగా పనిచేస్తూ వ్యవసాయంలో సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎంపీడీవో కె యుగకీర్తి అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో యుగ కీర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వివిధ పంటలకు సంబంధించిన విత్తనాలే కాక డ్రిప్పులు, స్ప్రింకర్లు ,పైపులు తదితర వాటిని సబ్సిడీపై అందిస్తుందని, అదేవిధంగా సజ్జల కొనుగోలు కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థాపించి రైతులకు గిట్టుబాటు ధరలకు వారి వద్ద నుండి పంటను కొనుగోలు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. లక్కవరం గ్రామంలో సజ్జల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని, అదేవిధంగా డిసెంబర్ నెల నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా ప్రారంభించాలని, వ్యక్తిగత యంత్ర పరికరాలను అందించి ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు అధికారులు ద ృష్టికి తెచ్చారు .ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్‌రావు, తాళ్లూరు పశువైద్యాధికారి డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, సిఆర్పి నరసింహులు, ఫిషనరీస్ అసిస్టెంట్ ఎలీషా, సెరికల్చర్ అసిస్టెంట్ నాగరాజు నాయక్, ఎఫర్ట్ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి, సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రాయితీపై ఇచ్చే యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం :
ప్రభుత్వం రాయితీపై ఇచ్చే యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని యర్రగొండపాలెం యంపీపీ దొంతా కిరణ్ గౌడ్ అన్నారు. యర్రగొండపాలెం మండల వ్యవసాయ అధికారి కార్యాలయం నందు ప్రతినెల రెండో శుక్రవారం జరిగే మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సభ్యుల సమావేశం, చైర్మన్ నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ గౌడ్ మాట్లాడుతూ రైతులకు వ్యక్తిగత రాయితీపై తైవాన్స్ స్ప్రేయర్లు, పట్టలు, యంత్ర పరికరాలు, తదితర పరికరాలు వచ్చేలా చూడాలని అన్నారు. మొదటి శుక్రవారం గ్రామస్థాయిలోనూ, రెండో శుక్రవారం మండల స్థాయిలోనూ మూడో శుక్రవారం జిల్లా స్థాయిలోనూ వ్యవసాయ సలహా మండల సభ్యుల సమావేశం నిర్వహించటం వలన గ్రామస్థాయి నుంచి వచ్చే సమస్యలను రాష్ట్ర స్థాయిలో చర్చించడం జరుగుతుందని, ప్రభుత్వ పథకాలు అమలు చేసే విధానం పారదర్శకంగా ఉంటుందని, ఇక్కడ చర్చించిన అంశాలను సభ్యులు గ్రామంలో రైతులకు కూడా తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం జెడ్పీటీసీ చేదూరి విజయబాస్కర్, యర్రగొండపాలెం వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఉద్యాన అధికారి ఆదిరెడ్డి, సూక్ష్మ సేద్య అధికారి రామిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-తర్లుపాడు : మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక గ్రంథాలయ ఆవరణలో ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని గ్రంథ పాలకుడు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, సెమినార్, పాటలు, డాన్స్, మ్యూజికల్ చైర్స్ లాంటి వివిధ రకాల పోటీలను ఈ నెల19వ తేదీ వరకు నిర్వహించటం జరుగుతుందన్నారు. అందులో గెలుపొందిన విజేతలందరికీ 20వ తేదీన బహుమతుల ప్రధానం చేయడం జరుగుతుందని గ్రంథ పాలకుడు వెంకటేశ్వర్లు తెలియజేశారు.

ఉత్తమ ఉపధ్యాయురాలిగా ఫైరోజ్ భేగం

విశాలాంధ్ర-చీరాల : ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎన్నికవ్వడం చాలా ఆనందంగా ఉందని, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను భోదించేందుకు నా వంతుగా కృషి చేస్తానని అసఫ్ అలీ ఉర్దూ పాఠశాల ప్రదనోపాధ్యాయురాలు ఫైరోజ్ భేగం అన్నారు. శుక్రవారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆంధ్రప్రదేశ్ ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమంలో ఆమె పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎన్నికైన షేక్ ఫైరోజ్ బేగంకి అసఫ్ అలీ మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

చిన్ని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ విద్యాదినోత్సవం

విశాలాంధ్ర-రాచర్ల : రాచర్ల మండలం చినగానిపల్లెకు చెందిన చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాచర్ల మండల కేంద్రంలోని స్పందన విద్యాసంస్థల నందు జాతీయ విద్యాదినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మాగులూరి శ్రీకాంత్ మాట్లడుతూ విద్యార్థులు చదువులలో మంచిగా రాణించి ఉన్నతంగా మెలగాలని ఆకాంక్షించారు. స్పందన విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పేర్లసుధీర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌వలి, స్పందన విద్యాసంస్థ విద్యార్థులు, ఉపాద్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటల్లో రాణించాలి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమ్మనబ్రోలు నందు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలను 14,17 సంవత్సరముల బాల బాలికలకు వాలీబాల్ కబడ్డీ, కోకో, అథ్లెటిక్స్ నిర్వహించారు. విద్యార్థులు ఆటలతో పాటు విద్యలోనూ రాణించి ఉన్నతంగా ఎదగాలని ఎంఈఓ మహబూబ్ సుభాని మరియు హెచ్‌ఎం సత్యవతి ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, రఘుబాబు, విక్రమ్ మోహన్ రావు, మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు ఎంపికలను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మరియు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నత్తల కృష్ణ పర్యవేక్షించారు. ఈ ఎంపికలకు మండలంలోని స్కూల్స్ నుండి 150 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర-యద్దనపూడి : మండలంలోని అన్ని గ్రామాలలో రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని బాపట్ల జిల్లా ఆర్డీవో జి రవీందర్ అన్నారు. మండలంలోని జాగర్లమూడి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ రీ సర్వే ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని అన్నారు. దీనికి ప్రతి రైతు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటరెడ్డి ఆర్ఐ విష్ణు మండల సర్వేయర్ సాంబశివరావు వీఆర్వో ఖాసింవలి రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మండలం తాళ్లూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం సిమెంటు రోడ్డును వైఎస్‌ఆర్సిపి ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. మండల ఎంపీపీ దంతలూరి ప్రకాశం, జెడ్పిటిసి కస్తూరిరెడ్డి, సర్పంచ్ మంగతాయారు, వైసిపి నాయకులు మూలే మాలకొండారెడ్డి, మండల కో ఆప్షనల్ సభ్యులు షేక్ రహీం, మాజీ సర్పంచ్ మూలే ఈశ్వరమ్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి కస్తూరిరెడ్డి మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు ఐదు లక్షలు, జడ్పీ నిధులు ఐదు లక్షలతో సిమెంట్ రోడ్డును నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, గురు బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

మౌలానా అబ్దుల్ కలాం జయంతి

విశాలాంధ్ర-కనిగిరి : సమాజంలో ప్రతి ఒక్కరికి మెరుగైన విద్య అందాలని కోరుకుంటున్నట్లు తెలుగుదేశం పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు తమ్మనేని శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్ లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వతంత్ర భారతదేశంలో జవహర్ లాల్ మంత్రివర్గంలో మొదటి విద్యాశాఖ మంత్రిగా 1974 నుంచి 1958 వరకు సేవలు అందించారని టీడీపీ నాయకులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మునిసిపాలిటీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి రోషన్ సందాని, రాష్ట్ర రైతు నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, మాజీ కో ఆప్షన్ షేక్ షరీఫ్, రహమాన్, రీటాఫయాజ్, నాగూర్, షాకీర్, సుభాని, మిన్ను, మున్నా, ఇలియజ్, కరాటే యాసిన్, అహ్మద్, బారా ఇమాం, వలి, షాహిద్, జిలాని, షాహిద్, ఖాదర్ వలి, ఎస్సీ సెల్ అధ్యక్షులు బుల్లా బాలబాబు, అచ్చాల రవి, బీసీ సెల్ అధ్యక్షులు తిరుపాలు, ఏనుగు శ్రీను, మూలే బ్రహారెడ్డి, వెంకటేస్వర్లు, పి. శ్రీను, సురేష్, మారుతి, శ్రీను, మోజెస్, ఆలీస్, ఎం.శ్రీను, నాగబాబు, షద్రేక్, హాజరత్, ప్రభుదాస్, శరత్, నారాయణ, బాలకృష్ణ, వెంకన్న, రవి, వలి, ఎం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై మండిపడ్డ ప్రత్యేక అధికారి

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం మండలస్థాయి గ్రామస్థాయి అధికారులపై మండల ప్రత్యేక అధికారి బాబురావు మండిపడ్డారు. త్రిపురాంతకం మండలపరిషత్ కార్యాలయంలో అధికాలతో శుక్రవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియదాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా మండలంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు బాలవివాహలపై జరగవలసిన అవగహన కార్యక్రమాలు జరగక పోవడంతో వారిపై మండిపడ్డారు. ఇప్పటి నుంచి అయినా కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీలతో గ్రామాలలోకి వెళ్లాలని ఆదేశించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్నా పాలవెలువ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్క గ్రామంలో కమిటీలు,యంత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. అనంతరం గృహ నిర్మాణ శాఖతో మాట్లాడుతూ ప్రతి ఒక్క లబ్ది దారునికి సకాలంలో బిల్లులు అందేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో గృహ నిర్మాణ శాఖ పనితీరు సక్రమంగా లేదని మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గృహనిర్మాణ శాఖ అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పనిచేయాలని ఆదేశించారు.

వినతి పత్రం అందించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు :

త్రిపురాంతకం మండలంలోని గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ప్రత్యేక అధికారి, ఎంపిడిఓలకు వినతిపత్రం అందించారు. తమకు పని ఒత్తిడి అధికంగా ఉందని తమ సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. అదనంగా ఉన్న శానిటేషన్, బుతులెవల్ ఆఫీసర్ బాధ్యతలు తొలగించాలని తెలిపారు. తాము ఏ శాఖ పరిధిలో పనిచేస్తున్నామో తమకే తెలియడంలేదని వారు వాపోయారు. ఇప్పటికి అయిన అధికారులు తమ విదులు పరిశీలించి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఎస్సీ ఎస్టీలకు జగనన్న గృహాలు నిర్మిస్తాం :

సమీక్ష సమావేశం అనంతరం త్రిపురాంతకం మండల కేంద్రంలో ఉన్న జగనన్న కాలనీని సందర్శించారు. కాలనీ సమీపంలో ఉన్న త్రిపురాంతకం పారిశుద్ధ్య కార్మికుల కాలనీ వాసులను కలిశారు. అక్కడ ఉన్న గుడిసెలు, చిన్నారుల దీన పరిస్థితి చూసి మనసు చలించి అక్కడ ఉన్న చిన్నారులకు కొంత ఆర్థిక సహాయం అందించారు. అక్కడ ఉన్న ఎస్టీ మహిళలు పొదుపు సంఘాలలో లేక గృహాలు మంజూరు కాలేదని తెలుసుకొన్నారు. వీరిని వెంటనే పొదుపు సంఘాల్లో చేర్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం యన వెంట ఎంపిడిఓ మరియదాసు, వెలుగు ఏపి లక్ష్మరెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈయన్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ మల్లికార్జున పాల్గొన్నారు.

ముస్లింలకు వైసీపీలో భద్రత ఎక్కడ..?

విశాలాంధ్ర-వెలిగండ్ల : వైసీపీ ప్రభుత్వంలో ముస్లింలకు భద్రత కరువైందని జిల్లా మాజీ కోఆప్షన్స్ సభ్యులు షేక్ షరీఫ్ అన్నారు. శుక్రవారం రాష్ట్రంలో వైసిపి పాలనలో ముస్లింలకు భద్రత కరువైందని టీడీపీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు మౌలానా మస్తక్ అహ్మద్‌ను మంగళగిరిలో అరెస్టు చేయడం ఇందుకు నిదర్శనమని గత ప్రభుత్వం ముస్లింల కొరకు ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టి వారిని ఆర్థికంగా బలోపేతం చేసిందని ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం బూటకపు హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.